# ప్రేమిక దంపతులు — చంద్రలోకపు —
# (ఊహా చిత్రము) — మధుర స్మృతులు —

కీ. శే. ఆకుండి వ్యాస ప్రభాకరశాస్త్రి

"శంకర్! మహోదాత్తమైన నీ త్యాగము, విశ్వకళ్యాణ విజ్ఞానాభివృద్ధికై నీవొనర్చు కృషికి నేనెంతయు సంతసించుచున్నాను. నీ వంతటి పనికి పూనుకొన్నప్పుడు నిండు మనంబుతో నిన్ను పంపెదను. వీరపత్నినైతినని సంతసించుచున్నాను."

"లీలా! నాయదృష్టముచే నీవు నాకు భార్యవైతివి. నిష్కళంక ప్రేమతో నన్నర్థము చేసికొంటివి. చందమామ మనకు సాక్షి. అతనిని దర్శించి విశేషముల నరసి త్వరలో నిన్ను కలసికొనెదను. ప్రేమతో నిన్ను వదలలేకున్నాను. అయినను ఈ ధైర్యమే నన్ను ప్రోత్సహించుచున్నది."

శంకర్ స్ఫురద్రూపి. విద్యావంతుడు, ఉన్నత వంశ సంజాతుడు. ఎమ్. ఎస్‌సి. పూర్తిచేసి గవర్నమెంటు స్కాలర్‌షిప్పులతో విదేశాలలో విజ్ఞాన పరిశోధనలు సాగించాడు. రాకెట్టులు, ఉపగ్రహాలు, అతని విమర్శనాశక్తిని, నూత్న ప్రదేశ సందర్శనాభిలాషను ప్రోత్సహించాయి. చంద్రగ్రహ విశేషాలను భూలోక వాసులకు అందజేయాలనే తదేక దీక్షతో ప్రాణ సమానమైన అర్ధాంగి యొద్ద సెలవు తీసికొన్నాడు.

ఆకాశంలో ప్రయాణం సుగమంగా సాగిపోయింది. గాలిలో మార్పులు మానవుని మనుగడికి అడ్డమయే పరిస్థితులు గోచరించాయి. కృత్రిమ సాధనాలతో ఊపిరి నిల్పుకొంటూ పయనము సాగించాడు, కొద్దిదూరం. 'లైకా' స్థితికి దిగజారి పోతాడనుకుంటున్నాడు ...

విశ్వాంతరాళంలో అనేక గ్రహరాశులు ప్రకాశిస్తున్నాయి. భూమి, చంద్రుడు సూర్యుని చుట్టి తిరిగి వస్తున్నాయి. స్వయంప్రకాశమగుటచే సూర్యమండల ముత్కృష్టమైనది. ఆ కనిపించేదే చంద్రమండలము. సుప్రసిద్ధ స్ఫటిక శిలామయ గోళము. సూర్యకిరణాలు ఆగోళముపై ప్రతి ఫలింపగా శీత కిరణాలు వెదజల్లుతూ ఉంది. ఆ దేశపు రాజు; చంద్రమహారాజు, 27 మంది భార్యలు, పట్టమహిషి, ప్రియురాలు తారాదేవితో విలాసాల తేలుతున్నాడు. భార్యలకందఱకు 27 చంద్రకాంత శిలామయ భవనాలు నగరము

చుట్టూ నిర్మించాడు. దినమున కొంత భార్యతో విహరిస్తూ ప్రజల ఆరోగ్యరక్షణయందు, విద్యలయందు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ న్యాయంగా పరిపాలిస్తున్నాడు.

"ప్రభూ! ఏలినవారి ఉద్యానవనంలో ఈతడు పడియున్నాడు. అందము, ముఖంలో వర్చస్సుచూచి మీయొద్దకు యీతనినితీసికొనివచ్చాము; ఆపై ప్రభువుల చిత్తము" అని యొక శవమును చంద్రమహారాజు ముందుంచినారు అతని ఉద్యానవన పాలకులు.

నిశ్చలమై, నిర్మలమై, ముఖంపై తాండవించే కళ కనుగొని చంద్రమహారాజు తన వైద్య నిపుణతచే అతనిని పునర్జీవితునిచేయ ప్రయత్నించెను. శీతలోపచారములు చేసిన వెనుక సేదదేరి మెల్లగ కన్నులువిప్పి ఆసభాంతర స్థితమహోన్నత విగ్రహములగాంచి దిగ్భ్రమజెంది రాజు ముఖమండలి ఆనందచిహ్నముల చూచి తేరుకొని "ఆర్యా? ఇది ఏదేశము? నేనెందున్నాను? ఏమిజరుగుచున్నది?" అని తన మాతృభాషయగు ఆంధ్రమున ప్రశ్నించెను. వారందరును ఆరు అడుగుల పొడుగుననున్న అతనినిచూచి నవ్వుకొనసాగిరి. మహారాజాతనికి ఫలహారముల తెప్పించెను. మానవ సహజముగ ఆశతో వెంటనే తినబోయెను. అవి పంచదార కన్న నెక్కువ తీపిగను చల్లగను ఉండుటచే ఎక్కువ తినజాలకపోయెను. త్రాగుట కేదైన కావలెనని సంజ్ఞలుచేసెను. క్షీరపాత్రము నొకదానిని ముందిడిరి. అదియు తీయనై అతని దప్పిక తీరలేదు. మహారాజది గ్రహించి సెలయేటి నీటిని తేబంచెను. ఆనీరము గ్రోలగనే గాలి ఒత్తిడి వలన తనయందు గలిగిన మార్పులు వైదొలగ ఉత్సాహముతో మహారాజునకు నమస్కరించి:-'రాజా! నేను భూలోకవాసిని మానవులుచేయు ప్రయత్నములలో సాయపడనెంచి చంద్రమండల రహస్యముల తెలిసికొనగోరి విమానముపై బయలుదేరినాడను; మార్గమధ్యమున స్పృహ తప్పినది. ఇప్పుడు ప్రభువులను గ్రహించిన నీరముచే తిరిగి బ్రతికితిని. ఇచటినుండి చంద్రగోళమునకు పోవుమార్గమును తెలుపగోరెదను' అని వినయముగా ప్రార్థించెను. అవి యన్నియు వారికి అర్థమైనట్లు గోచరించలేదు.

చంద్రమహారాజు అతనిని తన కుమార్తె 'ప్రేమ' భవనమునకు కొనిపొండని ఆజ్ఞాపించెను. ప్రేమ విద్యావతి, రూపవతి, విలాసవతి, సుగుణనిధి. జాలి, కరుణ, ఆమెకు అలంకారములై ఉన్నాయి. తన తల్లి 'పూర్ణిమ'కు అల్లారు ముద్దుబిడ్డ. తండ్రికి మంత్రివోలె రాజకార్య నిర్వాహకురాలు.

(సశేషము)